క్లుప్తంగా

2న శంకుస్థాపన

కడియం: కడియపులంకలోని వల్లాలమ్మ ఆలయ పునర్నిర్మాణానికి సెప్టెంబర్ 2వ తేదీ రాత్రి 3.06 గంటలకు శంకుస్థాపన చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ పురాతన ఆలయాన్ని అత్యంత సుందరంగా భక్తుల సహాయ సహకారాలతో నిర్మించేందుకు నిర్ణయించారన్నారు. విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఆస్థాన శిల్పి, ఆగమ సిద్ధాంతి కురుగంటి షణ్ముఖ శాస్త్రి పర్యవేక్షణలో ఆలయ నిర్మాణం జరుగుతుందన్నారు.

సంఘ బలోపేతానికి కృషి



నియామక పత్రం అందుకుంటున్న వలీబాబా

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): సంఘం బలోపేతానికి కృషి చేసి, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని రాష్ట్ర నూర్‌భాషా దూదేకుల ముస్లిం మైనార్టీ సంక్షేమ సంఘం సహాయ కార్యదర్శి షేక్ వలీబాబా అన్నారు. రాజమహేంద్రవరంలోని సంఘం కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఈనెల 25న విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎస్ బాబీ కమిటీని నియమించారన్నారు. దానిలో భాగంగా తనకు ఈ పదవి కేటాయించారన్నారు.

చిరుధాన్యాల సాగుతో నీటి ఆదా

రాజమహేంద్రవరం రూరల్: చిరుధాన్యాల సాగుతో నీటిని ఆదా చేయవచ్చని, ఒక ఎకరంలో వరి పండించడానికి అవసరమయ్యే నీటితో సుమారుగా ఏడు ఎకరాలలో చిరుధాన్యాలను సాగు చేయవచ్చని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్యామ్‌రాజు నాయక్ అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డైమండ్ జూబ్లీ సెలబ్రేషన్‌లో భాగంగా శనివారం కాతేరులోని వ్యవసాయ కళాశాలలో చిరుధాన్య పంటలపై అవగాహన కల్పించారు. శ్యామ్‌రాజు నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చిరుధాన్య పంటల సాగును ప్రోత్సహిస్తోందని, రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. వ్యవసాయ పరిశోధనా స్థానం పెద్దాపురం అధిపతి డాక్టర్ పి.మునిరత్నం చిరుధాన్య పంటలు ఆవశ్యకత, ఉపయోగాలను వివరించారు.

ప్రధానోపాధ్యాయుడు రామలింగేశ్వరరావుకు డాక్టరేట్



రామలింగేశ్వరరావును అభినందిస్తున్న డీఈవో

కంబాలచెరువు : స్థానిక వీరేశలింగం ఆస్తికోన్నత ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.రామలింగేశ్వరరావు డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ అందుకున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఆయనను శనివారం డీఈవో ఎస్.అబ్రహం అభినందించారు.

విజిలెన్స్ అధికారుల తనిఖీలు

కంబాలచెరువు: ఇన్‌చార్జి రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.కుమార్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు, టౌన్ ప్లానింగ్ అధికారులు, వార్డు సచివాలయ సిబ్బందితో రాజమహేంద్రవరంలో కమర్షియల్ భవనాలను తనిఖీ చేశారు. శ్యామలా సెంటర్ సమీపంలోని మన్యం నవీన్ ఎలక్ట్రికల్స్, కోటగుమ్మం సెంటర్లోని బొమ్మన రెసిడెన్సీని తనిఖీ చేశారు. ఆ భవనాలకు సంబంధించి సెట్ బ్యాక్‌లు, బిల్డింగ్ ఎత్తులలో వైవిధ్యాలు, పార్కింగ్ ఏరియాలో అనధికారిక ఆక్రమణలను గుర్తించారు. అలాగే ఫైర్ సేఫ్టీ, ఏ ఓసీ ఉల్లంఘణలను గుర్తించారు. వీటిపై నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి సమర్పించబోతున్నామని కుమార్ తెలిపారు.

సదస్సులు నిర్వహించాలి

కంబాలచెరువు: జిల్లా న్యాయస్థాన ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, డీఎల్ఎస్ఏ చైర్మన్ గంధం సునీత ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అసంఘటిత కార్మికుల హక్కులు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ విషయంలో స్వచ్ఛంద సంస్థలు సహకరించాలన్నారు. డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రత్యూష కుమారి పాల్గొన్నారు.

సారా విక్రేతల అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: కవలగొయ్యి గ్రామంలో సారా విక్రయిస్తున్న లంకా సురేంద్రను బొమ్మూరు ఎస్సై జుబేర్ మహమ్మద్ అరెస్టు చేసి, పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. హుకుంపేటలో సారా విక్రయిస్తున్న పానగంటి సుబ్రహ్మణ్యాన్ని ఎస్సై జగన్‌మోహన్‌రావు అరెస్టు చేసి నాలుగు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు.

వివాహిత అదృశ్యం

కంబాలచెరువు: కాతేరు ప్రాంతానికి చెందిన వివాహిత అదృశ్యమైన సంఘటనపై మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. తన భార్య ఈనెల 16 నుంచి కనిపించడం లేదంటూ ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

నగరం.. జలమయం

- దంచికొట్టిన వాన
- పల్లపు ప్రాంతాల ప్రజల అవస్థలు



నీటి మునిగిన అర్బన్ తహసీల్దార్ కార్యాలయం



దేవీచౌక్ అమ్మవారి ఆలయ కూడలిలో ముంపు బారిన వీధులు

సీటీఆర్ఐ: వరుణుడు విశ్వరూపం చూపించాడు. ఉరుములు, మెరుపులు లేకుండా శనివారం ఆకస్మాత్తుగా కురిసిన వర్షానికి రాజమహేంద్రవరం జలమయమైంది. రెండు గంటల పాటు కుంభవృష్టిగా వర్షం కురియడంతో నగరంలో పలు వీధులు మునిగిపోయాయి. లోతట్టు ప్రాంతాలలో నీరు నిలిచిపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. వెంకటేశ్వర నగర్, దేవీచౌక్, తుమ్మలావ, ఆర్యాపురం, తాడితోట, దానవాయిపేట, సుబ్రహ్మణ్యం నగర్ తదితర ప్రాంతాలు చెరువులను తలపించాయి. అర్బన్ తహసీల్దార్ తహసీల్దార్ కార్యాలయం ముంపుబారిన పడింది. కార్యాలయంలోకి సైతం నీరు రావడంతో విధులు నిర్వర్తించడానికి సిబ్బంది ఇబ్బందులు పడ్డాయి. విలువైన పత్రాలను జాగ్రత్త చేశారు.

ఈదురు గాలుల బీభత్సం

కడియం: మండలంలోని కడియపులంక పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. శనివారం ఉదయం ఉన్నట్టుండి బలంగా వీచిన గాలులకు కడియపులంక నుంచి వీరవరం వచ్చే రోడ్డులో పలు చోట్ల చెట్లు నేలను తాకాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. దీంతో పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సంబంధిత శాఖల సిబ్బంది రోడ్లపై పడిన చెట్లను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. విద్యుత్‌శాఖాధికారులు పడిపోయిన స్తంభాలను, లైన్లను బాగు చేసేందుకు చర్యలు తీసుకున్నారు.



ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న కమిషనర్ దినేష్ కుమార్

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

రాజమహేంద్రవరం సిటీ: రానున్న రోజులలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కార్పొరేషన్ కమిషనర్ దినేష్ కుమార్ ఆదేశించారు. శనివారం ఉదయం ఆల్కాట్ గార్డెన్స్ గూడ్స్ షెడ్ ఏరియా, శ్యామలా సెంటర్, కంబాలచెరువు, జేఎన్ రోడ్డు, కృష్ణా నగర్, తుమ్మలావ తదితర ప్రాంతాలలో ఇంజినీరింగ్, పబ్లిక్ హెల్త్ విభాగం అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. కాలువల్లో సిల్ట్‌ను ఎప్పటికప్పుడు తొలగించేలా చూడాలన్నారు. ఆయన వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ జి.పాండురంగారావు, మున్సిపల్ హెల్త్ అధికారి డాక్టర్ ఎ.వినూత్న, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శేషగిరిరావు ఉన్నారు.

నారా లోకేష్‌పై ఫిర్యాదు



బొమ్మూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న సోషల్ మీడియా ఇన్‌చార్జులు

రాజమహేంద్రవరం రూరల్: విద్వేష పూరిత ప్రసంగాలతో ప్రజలను రెచ్చగొట్టి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు కుట్రపన్నిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా విభాగం ఇన్‌చార్జులు కోరారు. ఈ మేరకు శనివారం బొమ్మూరు, ధవళేశ్వరం పోలీసుస్టేషన్లలో ఫిర్యాదులు చేశారు. యువగళం పాదయాత్ర పాదయాత్ర కోసం పోలీసులు ఇచ్చిన అనుమతి నిబంధనలను ఉద్దేశ పూర్వకంగానే ఉల్లంఘిస్తూ లోకేష్, ఇతర టీడీపీ నేతలు విద్వేషపూరిత ప్రసంగాలు చేస్తున్నారన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో జిల్లా వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ విజయ వర నాయుడు, రూరల్ సోషల్ మీడియా కన్వీనర్ అరిగెల హరీష్, కోకన్వీనర్లు జి.లోకేష్, నాగిరెడ్డిమోహన్, దీపశ్రీ, ఝాన్సీ, శ్రీనివాస్, సాయి ఉన్నారు.

సేవకు ప్రతిరూపం మదర్ థెరిసా

- ఆమె జీవితం స్ఫూర్తిదాయకం
- జయంతి సభలో ఎంపీ భరత్ రామ్



మదర్‌థెరిసా విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎంపీ భరత్‌రామ్, సిటీ కో ఆర్డినేటర్ గుడూరి శ్రీనివాస్



కార్యక్రమంలో పాల్గొన్న చందన నాగేశ్వర్, షర్మిలారెడ్డి

సీటీఆర్ఐ: సేవకు ప్రతిరూపం మదర్ థెరిసా, ఆమె జీవితం అందరికీ స్ఫూర్తిదాయమని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, ఎంపీ మార్గాని భరత్ రామ్ కొనియాడారు. మదర్ థెరిసా జయంతిని శనివారం సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. నగరంలోని 48వ డివిజన్ సంజీవ్ నగర్ పనస చెట్టు సెంటర్ వద్ద ఆ వార్డు ఇన్‌చార్జి అజ్జరపు వాసు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎంపీ భరత్ రామ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎక్కడో అల్బేనియా నుంచి మన దేశానికి వచ్చి కలకత్తా కేంద్రంగా మదర్ థెరిసా నిస్వార్థ సేవలు అందించారన్నారు. అలాగే కరోనా మహమ్మారితో ప్రజలందరూ ప్రాణభయంతో వణుకుపోతున్న సమయంలో జగనన్న సైన్యం పేరుతో నగరంలో దాదాపు 30 వేల మందికి నిత్యావసర వస్తువులు పంపిణీ, కరోనా పీడిత ప్రజలకు చేసిన అజ్జరపు వాసు బృందం చేసిన సేవలు అమోఘమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ అర్బన్ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, పోలు విజయలక్ష్మి, ఎస్వీ శ్రీనివాస్, కొంచె శేఖర్ పాల్గొన్నారు.

- స్థానిక గౌతమీ జీవకారుణ్యం వృద్ధాశ్రమంలో మదర్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఆంధ్రప్రదేశ్ పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, మాజీ రుడా చైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి పాల్గొన్నారు. వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యాంకర్ చోటు, ఆదిత్య కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కడియం: మండలంలోని పలు గ్రామాల్లో మదర్ థెరిసా జయంత్యుత్సవం నిర్వహించారు. దుళ్ల మార్కెట్ సెంటర్‌లో ఆమె విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. థెరిసా జయంతిని ఏటా ఘనంగా నిర్వహిస్తున్న స్థానిక కమిటీ సభ్యులు చందన సత్తిబాబు తదితరులను అభినందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తోకల శ్రీనివాస్, ఎంపీటీసీ కట్టుంగ నాగరాజు, మాజీ ఉప సర్పంచ్ తాతపూడి బాబీ, మాజీ సర్పంచ్ గురప్రు కొండయ్య మాస్టారు, మాజీ ఎంపీటీసీ ఈదర నందబ్బు, చిట్టూరి వెంకన్న చౌదరి, సభ్యులు పాల్గొన్నారు.

- పొట్టిలంక కొబ్బరి తోటలోని ప్రాథమిక పాఠశాలలో మదర్ థెరిసా సేవా సంఘం అధ్యక్షుడు నక్కా వెంకట రత్నంరాజు, కార్యదర్శి అర్థల కుమార్ బాబు, అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో మదర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

సమస్యలకు త్వరితగతిన పరిష్కారం

- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- వీటీ కళాశాల పరిశీలన



వీటీ జూనియర్ కళాశాల ఆవరణను పరిశీలిస్తున్న చందన నాగేశ్వర్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): వీటీ జూనియర్ కళాశాలలో సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ హామీ ఇచ్చారు. స్థానిక ఇన్నీసుపేటలో వీటీ జూనియర్ కళాశాల తరగతి గదులను, ఆవరణను శనివారం ఆయన పరిశీలించారు. కళాశాలలో ప్రహరీ నిర్మించాలని, తాగునీరు, మరుగుదొడ్ల సమస్యలు ఉన్నాయని ప్రిన్సిపల్, సిబ్బంది, స్థానికులు వివరించారు. వెంటనే చందన నాగేశ్వర్ కోకాకోలా వేమగిరి యాజమాన్యంతో మాట్లాడి సీఎస్ఆర్ నిధుల నుంచి కళాశాల విద్యార్థుల కోసం తాగునీరు ఏర్పాటు చేయాలని కోరారు. దానికి కోకోకోలా యాజమాన్యం సానుకూలంగా స్పందించిందని చందన తెలిపారు. అలాగే ప్రహరీ, ఇతర వసతులను త్వరలోనే ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. చందన నాగేశ్వర్ వెంట వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి మింది నాగేంద్ర, పార్టీ జిల్లా కార్యదర్శి కొప్పినీడి ప్రసాద్ బాబు (రాజమౌళి), మాజీ కార్పొరేటర్ బట్టంకి ప్రకాష్ ఉన్నారు.

జీవితంలో విద్యార్థి దశ అత్యంత కీలకం



విద్యార్థులతో పోలవరం ప్రాజెక్టు డిప్యూటీ కలెక్టర్ వరదా సుబ్బారావు

కడియం: మనందరి జీవితాల్లోనూ విద్యార్థి దశ అత్యంత కీలకమైందని, ఆ దశలో లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగితే విజయం వరిస్తుందని పోలవరం ప్రాజెక్ట్ డిప్యూటీ కలెక్టర్ వరదా సుబ్బారావు అన్నారు. కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు శనివారం రూ.30 వేల నగదు ప్రోత్సాహకం అందజేశారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు టి.సత్యనారాయణ అధ్యక్షత వహించగా, టూరిజం డిప్యూటీ కలెక్టర్ ఒంటిద్దు స్వామి నాయుడు, తహసీల్దార్ సుజాత ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని, చెడు వ్యసనాలకు ఇతర వ్యాపకాలకు లోను కాకుండా చదువుపైనే దృష్టి సారించాలని సూచించారు. ఉపాధ్యాయులు గొల్లపల్లి సత్యనారాయణ, రాజు డేవిడ్ పాల్గొన్నారు.

ఓటరు వివరాల డేటా ఎంట్రీ పూర్తి చేయాలి

- నియోజకవర్గ ఎలక్టోరల్ అధికారి, జేసీ తేజ్ భరత్



కార్యశాలలో దరఖాస్తులను పరిశీలిస్తున్న జేసీ తేజ్ భరత్

రాజమహేంద్రవరం రూరల్: ఇంటింటి సర్వే ద్వారా సేకరించిన ప్రతి ఓటరు గుర్తింపు వివరాలను నూరుశాతం డేటా ఎంట్రీ చేయాలని రాజమహేంద్రవరం రూరల్ నియోజక వర్గ ఎలక్టోరల్ అధికారి / జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్ ఆదేశించారు. రాజవోలులోని ఏఎంజీ ఆడిటోరియంలో శనివారం ఉదయం రాజమహేంద్రవరం రూరల్ నియోజక వర్గ బూత్ లెవల్ అధికారులు, సూపర్ వైజర్లతో ఓటరు గుర్తింపు, దరఖాస్తుల పరిశీలన కోసం ఏర్పాటు చేసిన కార్యశాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు జూలై 21 నుంచి ఈ నెల 25 వరకూ నియోజకవర్గంలో ఓటరు గుర్తింపు ఇంటింటి సర్వే నిర్వహించామన్నారు. బీఎల్‌వోతో పాటు అధికారిక రాజకీయ పార్టీ నియమించిన ఏజెంట్ కూడా ఈ ప్రక్రియలో భాగస్వాములు చేయడం ద్వారా జవాబుదారీతనం కలిగిన ఓటరు జాబితా రూపొందించగలుగుతామన్నారు.

29,744 దరఖాస్తుల స్వీకరణ

నియోజకవర్గంలో 29,744 దరఖాస్తులు స్వీకరించగా 20,242 ఆమోదించామని, 660 తిరస్కరించగా, 8,842 పరిశీలనలో ఉన్నట్లు జేసీ తెలిపారు. స్వీకరించిన ప్రతి దరఖాస్తును కచ్చితంగా బీఎల్‌వో క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. నియోజకవర్గ సహాయ ఎలక్టోరల్ అధికారి వ్యక్తిగత పరిశీలన తప్పనిసరి అన్నారు. ఒకే డోర్ నంబర్‌లో 10 మందికి మించి ఓటర్లు ఉంటే కచ్చితంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలన్నారు. ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ అని తెలియ చేశారు.

263 పోలింగ్ కేంద్రాలు

నియోజకవర్గ సహాయ ఎలక్టోరల్ అధికారులు, రూరల్, కడియం తహశీల్దార్లు పి.చిన్నారావు, సుజాత వివరాలు తెలుపుతూ నియోజకవర్గంలో 263 పోలింగ్ కేంద్రాల ద్వారా ఇంటింటి సర్వే నిర్వహించామని, 94,403 ఇళ్ల ఇంటింటి సర్వేలో 2,56,880 మంది ఓటర్లకు గానూ 2,49,174 మంది (97 శాతం) వివరాలు నిర్ధారణ చేశామన్నారు. 1,266 మంది షిఫ్టింగ్, 3,891 మంది మరణించినట్లు, 688 డుప్లికేట్ ఓటర్లు, ఎపిక్ కార్డ్ ఫొటో అస్పష్టత ఉన్న 3726 ఓటర్లను గుర్తించి ఆ మేరకు సరిచేయడం జరిగిందన్నారు.

సీఎం జగన్‌కు అన్ని వర్గాల ఆదరణ

- సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్
- క్వారీ సెంటర్‌లో గడప గడపకూ..



ప్రజలకు అభివాదం చేస్తున్న సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అన్ని వర్గాల ఆదరణ లభిస్తోందని వైఎస్సార్ సీపీ సిటీ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 49వ డివిజన్ క్వారీ సెంటర్‌లో మాజీ కార్పొరేటర్, గౌతమీ జీవ కారుణ్య సంఘం అధ్యక్షుడు బర్రే కొండబాబు ఆధ్వర్యంలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ అందరి మేలు కోసం నిరంతరం తపన పడుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మనమంతా మద్దతు తెలియజేయాలన్నారు. నవరత్నాల పథకాలతో పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. తండ్రిని మించిన తనయుడిగా పాలన సాగిస్తున్నారన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే చెప్పాలని, ఆయా పథకాలకు అర్హత ఉండి అందకపోతే తమకు తెలియజేయాలని కోరారు. జగన్ పాలనకు ఆకర్షితుడినై తాను రాజకీయాల్లోకి వచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఐడీసీ స్టేట్ డైరెక్టర్ కానుబోయిన సాగర్, గారా చంటిబాబు పాల్గొన్నారు.

ముకుందా.. ముకుందా..

- నేటి నుంచి శ్రీకృష్ణాష్టమి వేడుకలు
- ముస్తాబైన ఆలయాలు
- 7వ తేదీన శ్రీకృష్ణ జన్మాష్టమి



శ్రీకృష్ణచైతన్య ఆశ్రమంలో బలరామ, సుభద్ర, జగన్నాథుని విగ్రహాలు


సీటీఆర్ఐ: శ్రీకృష్ణాష్టమి వేడుకలు నగరంలో ఆదివారం నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. గోదావరి గట్టున గల ఇస్కాన్ మందిరంలోనూ, ఆర్యాపురం శ్రీకృష్ణచైతన్య మిషన్‌లోనూ వచ్చే నెల 7వ తేదీ వరకూ ఘనంగా నిర్వహించనున్నారు. రాజమహేంద్రవరం క్షేత్రపాలకుడు వేణుగోపాల స్వామి కావడంతో శ్రీకృష్ణాష్టమిని ప్రత్యేకంగా నిర్వహిస్తారు. చిన్నికృష్ణుడి వేషధారణలో చిన్నారులను ముస్తాబు చేసి, వారికి వెన్న తినిపించి తల్లిదండ్రులు ఆనందం పొందుతారు. అలాగే పలుచోట్ల ఉట్టికొట్టే కార్యక్రమం వేడుకగా జరుగుతుంది. జాంపేటలోని పాండురంగ ఆలయం, దేవిచౌక్‌లోని దశావతార కృష్ణుని గుడి, లాలాచెరువు గోవింద క్షేత్రంతో పాటు నగరంలోని ఉన్న అన్ని కృష్ణుడు ఆలయాలలో వేడుకలు నిర్వహిస్తున్నారు.

ఇస్కాన్ ఆలయంలో..

ఇస్కాన్ మందిరంలో కృష్ణాష్టమి పర్వదినం ఉదయం 4.30 గంటలకు మహా మంగళ హారతి, 7.30 గంటలకు శృంగార హారతి, 8.14 గంటలకు శ్రీమద్ భాగవత ప్రవచనం, 9.30 గంటలకు అఖండ హరినామ సంకీర్తన, 10 గంటలకు పూర్ణాహుతి, 11 గంటలకు అవభృధ స్నానం, మధ్యాహ్నం 3 గంటలకు ఉట్టి ఉత్సవం, సాయంత్రం 5.30 అనంత శేషవాహన సేవ, 7 గంటలకు తెప్పోత్సవం, రాత్రి 8 గంటలకు శ్రీకృష్ణ లీలామృత ప్రవచనం, 10.30 గంటలకు రాధా గోపీనాథులకు మహాకుంభాభిషేకం, రాత్రి 11.30 నుంచి మహా మంగళహారతి, మహాప్రసాద వితరణ నిర్వహిస్తారు.

శ్రీకృష్ణ చైతన్య ఆశ్రమంలో..

ఆర్యాపురం శ్రీకృష్ణ చైతన్య మిషన్, ఆశ్రమం ఆధ్వర్యంలో ఆదివారం నుంచి వచ్చే నెల ఏడోతేదీ వరకూ శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రతిరోజూ సాయంత్రం 6 గంటలకు రాధాకృష్ణుల ఊయల ఉత్సవం జరుగుతుంది. 28వ తేదీ సాయంత్రం 7.30 నుంచి రాత్రి 9 వరకూ త్రిదండి స్వామి భక్తి కంకణ బన మహారాజ్ చే ఊయల లీలా విశిష్టతపై ఉపన్యాసం జరుగుతుంది. 30వ తేదీ సాయంత్రం 7 నుంచి రాత్రి 9 వరకూ సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా భరత నాట్య ప్రదర్శన నిర్వహిస్తారు.



విద్యుత్ దీపాలంకరణలో ఇస్కాన్ ఆలయం

31న బలరామ జయంతి



బలరామ జయంతిని పురస్కరించుకుని ఈనెల 31వ తేదీ ఉదయం 9 గంటలకు గోపూజ జరుగుతుంది. సెప్టెంబర్ ఏడో తేదీ వరకూ ప్రతిరోజూ సాయంత్రం 7 నుంచి రాత్రి 9 వరకూ భాగవతాచార్యులు, శ్రీపాద సురేష్ దాస్ బ్రహ్మచారి ఆధ్వర్యంలో శ్రీమద్ భాగవత ఉపన్యాసం ఉంటుంది. 6 సాయంత్రం 7.30 నుంచి రాత్రి 9 గంటల వరకు భరతనాట్య ప్రదర్శన జరుగుతుంది. 7వ తేదీన శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా రాత్రి 11 గంటలకు బాలగోపాలునికి మహాభిషేకం, 12 గంటలకు మహా హారతి, తీర్థ ప్రసాద వితరణ జరుగుతాయి.

– శ్రీపాద హరిదాస్ బ్రహ్మచారి

సంక్షేమ పథకాలకు అర్హతే ప్రామాణికం

- వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- కాతేరులో గడప గడపకూ..



ప్రజలతో మాట్లాడుతున్న చందన నాగేశ్వర్

రాజమహేంద్రవరం రూరల్: అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్నారని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. కాతేరు గ్రామ సచివాలయం-2 పరిధిలో శనివారం రెండోరోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. చందన నాగేశ్వర్, సచివాలయ కన్వీనర్లు, ఉద్యోగులు, వలంటీర్లతో కలిసి లబ్ధిదారులతో మాట్లాడారు. వారికి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాలను వివరించి బుక్‌లెట్లు పంపిణీ చేశారు. స్థానికుల నుంచి సమస్యలను తెలుసుకున్నారు. కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు.

ప్రజల వద్దకే పాలన

చందన నాగేశ్వర్ మాట్లాడుతూ ప్రజల వద్దకే పాలనను తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ, రైతుభరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. నాలుగేళ్లుగా అన్ని శాఖల మండల, గ్రామ స్థాయి అధికారులను సమన్వయం చేసుకుంటూ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్న ఆలోచనతో అహర్నిశలు పనిచేస్తున్నామన్నారు. గ్రామ చివాలయం-2 సచివాలయ కన్వీనర్లు కొత్తపల్లి నాగేశ్వరరావు, పెనుమాక సునీల్, మాజీ సర్పంచ్ ఆచంట వెంకట సుబ్బారాయుడు, సొసైటీ అధ్యక్షుడు ఆచంట కళ్యాణ్, పార్టీ నాయకులు యెజ్జు వాసు, డాక్టర్ చిరంజీవి, మానుకొండ వెంకటరావు, మద్దా దుర్గారావు, నక్కా ధనరాజ్, చీకట్ల రంజిత్, సూర్యారావు, దిలీప్, వెంకటేష్, ఆనంద్, డీపీ రాజు, కె.రాజు, కె.నాని, కిరణ్, దేవమాత, రాజేశ్వరి పాల్గొన్నారు.